# కేశవరెడ్డి నవలలు – ఒంటరి పోరాటం

ఆచార్య జి. అరుణ కుమారి
హెడ్, సెంటర్ ఫర్ క్లాసికల్ లాంగ్వేజస్, తెలుగు,
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

కేశవరెడ్డి 1984లో రచించిన అతడు అడవిని జయించాడు నవలను 1988లో ఉత్తమ నవలగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు ఎంపిక చేసారు. సూర్యాస్తమయ సమయాన మొదలై సూర్యోదయానికల్లా ముగిసే ముసలివాడి ఆటవిక జీవన పోరాటం 'అతడు అడవిని జయించాడు' నవలలో కనిపిస్తుంది.

అడవిలో తప్పిపోయిన పందిని, అది అప్పుడే ప్రసవించిన సలుగుల్ని రక్షించి ఇంటికి తీసుకు రావాలనే ప్రయత్నంలో అతని జీవన పోరాటమే నిత్యజీవన పోరాటంగా కొనసాగించి పశుపక్ష్యాదుల తాకిడికి సమస్తాన్నీ కోల్పోయి ముసలివాడు ఇంటికి తిరిగివస్తాడు. ప్రకృతి పోరాటంలో భాగంగా అతడు అడవిని జయించి, జీవిత సత్యాన్ని గ్రహించి, అనుభవ పరంపరలతో నడిచిన జీవితం కూడా జడత్వానికి దారి తీస్తుందనే సత్యాన్ని అడవినుండి అనుభవ పాఠాన్ని గ్రహించి వచ్చాడు. జీవిత సత్యాన్ని గ్రహించటానికి తన సంపద అయిన సుక్క పందిని దాని సలుగుల్ని పోగొట్టుకున్నాడు. సంఘర్షణలో జీవన సత్యం, జీవిత పరమార్థం దాగి ఉందన్న అంశాన్ని

నిరూపించాడు రచయిత. సమస్యలను ఎదుర్కొన్నప్పుడు ఆ సమస్యల పరిష్కార మార్గంలో అది సఫలమైనా, విఫలమైనా అది మనిషి ఆలోచనలకు పదును పెడుతుంది. రాబోయే సంఘటనలకు సూచన లిస్తుంది. ఒక విధంగా సంఘటనలు మనిషిని హెచ్చరిస్తూ జీవిత పాఠాలు నేర్పిస్తాయి. భూమిపై ఉండే జంతువులతోను, ఆకాశంలో విహరించే పక్షులతోను పోరాటం చేయవలసి వచ్చింది. పందిని, సలుగుల్ని క్రూరమృగాలకు వదలి ఇల్లు చేరలేదు. వాటిని బాధ్యతతో చివరివరకు కాపాడే ప్రయత్నం చేసాడు. వ్యక్తి జీవన పోరాటంలో నానావిధాలైన వైరుధ్యాలుంటాయి. 'నాగరికుడైన ఒక మానవుని సుఖదుఃఖాలు ఒక మొరటు జంతువుపైన ఆధారపడి ఉండడం ఎంత విచిత్రం!' (పుట 75).

ఎర్నెస్ట్ హెమింగ్వే రచించిన ఓల్డ్ మెన్ అండ్ ది సీ నవల 1953లో పులిట్జర్‌ను, 1954లో సాహిత్యంలో నోబుల్ బహుమతిని అందుకుంది. ఓల్డ్‌మెన్ అండ్ ది సీ ఇంగ్లీషు నవల కేశవరెడ్డి రచించిన అతడు అడవిని జయించాడు నవలకు స్ఫూర్తి నిచ్చింది. ఈ రెండు నవలల్లో ముసలాడు పిల్లవాడు ప్రధాన పాత్రలు. ఓల్డ్ మెన్ అండ్ ది సీ నవలలో ముసలివాడు 'శాంటియాగో' తాను అదృష్టవంతుడనని భావిస్తాడు. ఎందుకంటే 'మనుషులు రోజుకొక చందమామను చంపాల్సివస్తే ఎలా ఉంటుంది అని అనుకున్నాడు. అలాంటి పరిస్థితే వస్తే చందమామ మనుషులకు అందనంత దూరం పారిపోతుంది. కానీ సూర్యుడ్ని చంపటానికి ప్రతి ఒక్క మనిషి ఇట్లా ఒక రోజు ప్రయత్నం చెయ్యాల్సి వస్తే? ఏదేమైనా మనం అదృష్టంతో పుట్టాం! (పుట 53).

ముసలివాడు శాంటియాగో మనుగడ కోసం సముద్రంతో, పెద్ద చేపలతో, తాను పట్టిన చేపలను తినడానికి వచ్చే సొర చేపలతో, వృద్ధాప్యంలో అవయవాల అశక్తతతో పోరాటం చేస్తూ అదృష్ట దురదృష్టాలను తలపోసే సమయంలో పిల్లవాని మాటలు తన జవసత్వాలకు ఊపిరి పోసాయి. ఓల్డ్‌మెన్ అండ్ ది సీ నవల ఎంతటి ముసలివాడికయినా జీవించాలనే కోరికను, శక్తతను కలిగిస్తుంది.

కేశవరెడ్డి నవలలకు పెట్టిన శీర్షికలు పరామర్శించదగినవి. సిటీ బ్యూటిఫుల్, ఇన్‌క్రెడిబుల్ గాడెస్ వంటి ఇంగ్లీషు శీర్షికలు, రాముడుండాడు రాజ్జింవుండాది, భగవానువాచ... వంటి తెలుగు శీర్షికలు పాజిటివ్ ఆలోచనలు కలిగించేవిగా కనిపించినా ఆ నవలల్లో ఇతివృత్తం మాత్రం అందుకు భిన్నమైన సందేశాన్ని అందిస్తున్నాయి.

కేశవరెడ్డి నవలల్లో 1) సమాజంలో ఒంటరిగా పోరాడే వ్యక్తుల జీవితాలు ముఖ్యంగా దళితుల జీవనం, 2) దళిత స్పృహతో జీవన సంఘర్షణ కొనసాగించే వారికి చైతన్యం కలిగించే పాత్రలు ఎదుర్కొనే సంఘర్షణలు, 3) జీవన పోరాటంలో సమస్తమూ పోగొట్టుకున్నవారు, 4) ఎదురు నిలిచి గెలిచిన వారు, 5) అస్తిత్వ పోరాటంలో సమాజ విలువలకు కట్టుబాట్లకు కట్టుబడని పాత్రలు, 6) సమాజ ఆటవిక విలువలకు కట్టుబాట్లకు కట్టుబడిన పాత్రలు, 7) ప్రతిఘటించే పాత్రలు, 8) ఒంటరి పోరాటం చేసే పాత్రలు, 9) సమాజంలో మార్పు రావాలని కోరుకునే పాత్రలు, 10) సమాజానికి దూరంగా బ్రతికే పాత్రలు, 11) పెత్తందారీతనం, దోపిడీ వ్యవస్థ, కులవ్యవస్థ పేరుతో ఆధిపత్యం వహించే పాత్రలు, 12) ఆ ఆధిపత్యానికి బలైన పాత్రలు, 13) చైతన్యాన్ని

అందిపుచ్చుకోని పాత్రలు, 14) జడత్వంలో కూరుకుపోయిన పాత్రలు.... ఇలా సమాజంలో ఇమిడే పాత్రలు, ఇమడని పాత్రలు కనిపిస్తాయి.

భగవానువాచ కథలో కేశవరెడ్డి కర్మ సిద్ధాంతాలను ప్రత్యక్షంగా ప్రతిఘటించకక పరోక్షంగా ప్రశ్నించి ఆలోచింపజేస్తాడు. ఏకనాయకాశ్రితం, ఒంటరి పోరాటం కేశవరెడ్డి సాహిత్యంలోని ప్రత్యేకత. కూతురి పెళ్ళికోసం దాచుకున్న డబ్బును బ్యాంకు నుండి తీసుకుని స్వగ్రామానికి లారీలో ప్రయాణం చేస్తాడు. ఆ డబ్బును కాజేయాలనే దుర్బుద్ధితో రామదాసును హత్య చేయాలనుకుంటారు. లారీ డ్రైవరు, క్లీనరు బడిపంతులు రామదాసుకు భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన ఉపదేశం గుర్తుకు వస్తుంది. 'పాప పరిహారమేమిటో భగవంతుడే నిర్ణయించి విధించాడు. మధ్యలో కలగజేసుకోవటానికి తానెవడు' అని రామదాసు మనసులో భావించి లారీ స్టీరింగ్ తిప్పి డ్రైవర్ క్లీనర్‌తో సహా లారీ గోతిలో పడేట్టు చేసి వారి మరణానికి కారణమవుతాడు. కాని తప్పతాగి లారీ నడిపి మరణించారని అబద్ధం చెప్పి నమ్మిస్తాడు. కేశవరెడ్డి భగవానువాచ నవలికలో ఆరంభమైన ఆటవిక న్యాయంపట్ల ప్రతిఘటన అన్ని నవలల్లోనూ కనిపిస్తుంది. కులం, మతం ప్రాతిపదికలపై మానవుల మధ్య మనస్సుల అంతరాలు నిరంతర పోరాటాలు, ఆ పోరాటాలలో కులపరమైన అనైక్య భావాలు, ఒక కులమైనా అందులో మంచి చెడుల వైరుధ్యాలు... సమాజంలోని అసమానతలను రచయిత ప్రదర్శించారు. తనలో, తనతో, సమాజంతో, ప్రకృతితో పోరాటం మానవ జీవ లక్షణంగా చూపిస్తాడు రచయిత. ఆ జీవన పోరాటంలో ఓటమి, అనైక్యత, అశక్తత, ఆవేదనలను నిరూపిస్తాడు. వ్యష్ఠి పోరాటం వలన

సమాజంలో మార్పు ఏర్పడటం ఎంత కష్టమో కేశవరెడ్డి నవలలు నిరూపిస్తాయి. కేశవరెడ్డి నవలల్లో ఒక వ్యక్తి ప్రతిఘటన, ఒంటరి పోరాటం ప్రధాన వస్తువు. సమష్టిలోని జడత్వం, వ్యక్తిలోని అశక్తత సమాజాన్ని ఏవిధంగాను బాగుపరచకపోగా ఆధిపత్యపు నీడలో బతుకుతూ, బలపరుస్తూ బానిసలుగానే బతకవలసి వచ్చే పరిస్థితిని బానిసలు అనే కథలో రచయిత నిరూపించారు. సుబ్బరాయుడు హరిజనుడు. మునసబుకు మద్దతు పలికి గాంధీ శత జయంతి సందర్భంగా హరిజనోద్ధరణ పథంలో అగ్రహారానికి మాలపల్లికి వేయవలసిన రోడ్డు నిర్మాణాన్ని ఆపివేస్తారు. అనైక్యత ప్రగతికి ఆటంకమని చీలికల వలన సమాజానికి ప్రయోజనం లేదని మునసబు కోరిక ఫలించిందనే విషయాలు అవగతమవుతాయి. ఇటువంటి సమస్యే ఇన్‌క్రెడిబుల్ గాడెస్ నవలలోను కనిపిస్తుంది. గంగపట్నంలో పెదరెడ్డి వలన ఇల్లు పోగొట్టుకున్న రంపాల తెగకు చెందిన రామచంద్రుడు రెండు వందల మైళ్ళ దూరం ప్రయాణం చేసి మరో ఒంటిల్లు అగ్రహారం చేరినా అక్కడా సమాజంలో అసమానతలకు గురికావలసి వచ్చింది. పోకనాటి వాళ్ళు, రంపాల వాళ్ళు మాలవాళ్ళలోని తెగల వైరుధ్యం వలన నలిగిన రామచంద్రుడు ఒంటరి పోరాటం చేస్తూ అటు పీడిత వర్గాల అణచివేతకు, తమ కులంలోని వైరుధ్యాల వలన ఐక్యత లేక అశక్తుడైన పరిస్థితి ఈ నవలలో ఎదురవుతుంది. పందుల్ని, సంతానాన్ని, భూమిని పోగొట్టుకొని నిరాశ్రయుడై అశక్తుడై ఒంటరి పోరాటం చేసే మానవుడి ఆవేదనకు మచ్చు తునకలు కేశవరెడ్డి నవలలు. ఆదర్శ భావాలున్న అర్జున రెడ్డి ఆశ్రయం ఉన్నా అతని మరణం వలన

నిరాశ్రయుడైన రామచంద్రుడు సమాజం గీసిన గీతను దాటలేని అశక్తతను, బానిస స్వభావాన్ని ఈ నవలలో నిరూపించారు.

పురాగాథల ఆధారంగా సమకాలీన మానవుని జీవన స్థితిని చూపించి పురా సంస్కృతినీ సమాజాన్ని ప్రతిబింబిస్తూ ఒక చారిత్రక సత్యాన్ని అందించే ప్రయత్నం చేసింది ఇన్‌క్రెడిబుల్ గాడెస్ నవల. మతం, ఇంద్రజాలం, చరిత్రతో సంబంధం, విషాదాంత ముగింపులో ఇమిడిన ఆచార వ్యవహారాల సంఘర్షణ ఈ నవలలో చోటు చేసుకున్నాయి. మానవుడిలో పురా విజ్ఞానానికి సంబంధించిన పరిజ్ఞానం అతడికి తెలియకుండానే అతడిలో ఇమిడి ఉంటుందనే విషయం బొంత గంగమ్మ జాతర మూలంగా రచయిత తెలియ జేసారు. ఆ జాతరలో గంగమ్మను ఎంత తిడితే కొడితే అంత సంతోషం అనే అంశాన్ని భూస్వాములు తమ చేతికింద పనిచేసేవారిని ఎంత తిడితే కొడితే అంత సంతోషం వారికి కలుగుతుందనే భావంతో గంగమ్మ క్షుద్రదేవతను దళితులతో పోల్చి చెప్పటం పురా విజ్ఞానానికి సంబంధించిన విషయం కాకపోయినా అది ఏదో పురా విజ్ఞానానికి సంబంధించిన విషయంగా మానవుల చేత సృష్టింపబడి సమాజంలో ఆమోద రూపం పొందేట్టుగా పెత్తందార్లు పై చేయి వహిస్తారు. ఏ కులంలోనైనా, ఏ మతంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా, అన్ని రకాల మనస్తత్వాలు కలిగిన మనుషులుంటారు. కులం గీసుకున్న గీతలు దాటిపోలేని మనుషులు, తెగల వైరుధ్యాలు, మత పరిధులు, మానసిక స్థితులు... భిన్న వైరుధ్యాల మధ్య సమాజ ఎదుగుదలకు కావల్సింది సమష్ఠి చైతన్యం గాని వ్యష్ఠి చైతన్యం వలన పరిస్థితులను చక్కబెట్టలేమని కేశవరెడ్డి నవలలవలన గ్రహించవచ్చు. రామచంద్రుడు

రంపాల తెగకు చెందినవాడు కాబట్టి అతని ఒంటరి పోరాటం, అర్జున రెడ్డి సమాజ విలువలకు కట్టుబడక చేసిన ఒంటరి పోరాటం సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపించలేకపోయింది.

సామాజికంగా ఆర్థికంగా అట్టడుగున ఉన్న హరిజనుల మూఢ నమ్మకాలు, అగ్రవర్ణాల అణచివేత, పాలక వర్గాల కర్మ సిద్ధాంతాల తీరు ఈ నవలలో చిత్రితమయ్యాయి. ఈ నవల హరిజన ఆత్మచైతన్యాన్ని చూపించ లేకపోయిందని తిరుగుబాటు తత్త్వం లేని కాలాన్ని వ్యవస్థని చూపించటానికి నవలలో రామచంద్రుడి చుట్టూ పరిస్థితులు కల్పింపబడ్డాయని (కృష్ణారెడ్డి పి.ఆర్. అరుణతార 3 సంపుటి మొదటి సంచిక 1980) హరిజన సమస్యకు పరిష్కారం సూచించటంలో రచయిత విఫలమయ్యాడని (ఇన్‌క్రెడిబుల్ గాడెస్ గ్రామీణ జీవిత చిత్రణ జి. పద్మ సుశీలాదేవి పర్యవేక్షణ ఆచార్య కె.కె. రంగనాథా చార్యులు 1989 ఎం.ఫిల్. అముద్రితం) అనే అభిప్రాయాలున్నాయి. ఇన్‌క్రెడిబుల్ గాడెస్‌లో రంపాల తెగకు చెందిన రామచంద్రుడు ఒంటరి పోరాటం చేయవలసి వచ్చింది. అదే తెగకు చెందిన వీరభద్రుడూ స్మశానం దున్నేరులో ఒంటరి పోరాటం చేయవలసి వచ్చింది. కాని ఈ నవలలో వీరభద్రుడు ప్రతిఘటించినందుకు ఇతర పోకనాటి కుటుంబాల దాడిని ఎదుర్కున్నా పెదరెడ్డి దుర్మార్గానికి బలైన ఆ కుటుంబాలే అతనికి ఎదురు తిరిగి భూస్వామ్య వ్యవస్థను నేలకూర్చారు. వ్యష్ఠి చైతన్యం కన్నా సమాజంలోని మార్పుకు సమష్ఠి చైతన్యం అవసరమని, ఐక్యత ఉండాలని నిరూపిస్తుందీ నవల.

బానిస బ్రతుకుల నుండి బయటపడిన కోనిగాడు, పుల్లిగాడు, కులవృత్తిని విడిచిపెట్టిన కంసాలి, పూజారి, పొలం పోగొట్టుకున్న తిరుపాల నాయుడు ఈ నవలలో మారిన పాత్రలుగా కనిపిస్తారు. 'రాముడుండాడు రాజ్జి వుండాది' నవలలో పేదవానికి ధర్మం లేదనే విషయాన్ని వ్యంగ్యంగా సూచించి సామాజిక పరిణామం నెలకొన్న విషయాన్ని రచయిత స్ఫురింపజేసారు. రైతుకు భూమికి ఉన్న సంబంధాన్ని గురించి మూగవాని పిల్లనగ్రోవి నవలలోను, యానాదుల జీవితాన్ని చివరి గుడిసె నవలలోను చిత్రితమయ్యాయి. సమాజంలోని marginalized పాత్రలను, వారి వృత్తిలోని సమస్యలను, వారి జీవన పోరాటాలను కేశవరెడ్డి నవలల్లో కనిపిస్తాయి. ఒంటరితనం ఇతివృత్తంగా కలిగిన ఇంగ్లీషు నవల కాచర్ఇన్దిరై. ఈ నవలలో నాయకుడు కాల్ఫీల్డ్. అతడు నమ్మిన విలువల్ని సమాజం అంగీకరించదు. సమాజ విలువలు అతనికి నచ్చవు. ఇమడలేని పాత్రగా కాల్ఫీల్డ్ కేశవరెడ్డిని ప్రభావితం చేసిందని స్వయంగా సిటీ బ్యూటిపుల్ నవల ఆరంభంలో ప్రస్తావించారు.

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న గిరిజనులు, దళితులు, బాధల్లో ఉన్న వారు వీరి నవలల్లో ప్రధాన పాత్రలు. సిటీ బ్యూటిపుల్ నవలలోను దేవీదాస్ మెడికల్ విద్యార్థిగా మిగిలిన విద్యార్థుల మనస్థత్వాలతోను ప్రొఫెసర్ మనస్తత్వాలతోను ఇమడలేక పోతాడు. దేవిదాస్‌కి తోటి విద్యార్థులు ఇంబెసైల్ వెధవల్లా కనిపిస్తారు. ఇంబెసైల్ అనే ఫ్రెంచి పదానికి అర్థం బుద్ధిహీనుడు. మానసికంగా శారీరకంగా దుర్బలురనే అర్థంలో ఈ పదం పలుమార్లు ఈ నవలలో ప్రయోగింపబడింది. దేవీదాస్ ఇష్టాయిష్టాలను, ఒంటరి తనాన్ని రచయిత ఈ

నవలలో చిత్రించారు. విద్యార్థి దశలో విద్యార్థులకుండే మానసిక పరిస్థితులను ఈ నవల వెల్లడిస్తుంది.  హెమింగ్ వే రాసిన ఫేర్ వెల్ టు ఆమ్స్ నవలలోని కథాశిల్పం కేశవరెడ్డిని ప్రభావితం చేసింది. పాండిచ్చేరిలో జిప్‌మర్‌లో మెడికల్ విద్యార్థిగా తన చుట్టు ఉన్నా విద్యార్థి జీవితానికి అద్దం పడుతుంది ఈ నవల.

పురుషాధిక్య కుటుంబ జీవనాన్ని అధికంగా అన్ని నవలల్లోను చిత్రీకరించారు రచయిత కేశవరెడ్డి. స్త్రీ ఆదిపత్యంతో మునెమ్మ నవలను రూపొందించారు. మునెమ్మను లైంగిక దృష్టితో బొల్లిగిత్త చూడడం అసహజంగా కనిపిస్తుంది. కాని ఈ కోణంలో గమనించినట్లయితే గ్రీకు రచన ఇలియడ్ లో Pasiphae కు ఎద్దుపైన ప్రేమ పుట్టడాన్ని కథనాత్మకంగా చిత్రీకరించాడు రచయిత. మానవుల మనస్సుల్లో ఉండే అచేతనా పద్ధతిని పరిశీలించడం ముఖ్యమని ఇది ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రానికి ముఖ్యమైన ప్రతిపాదన అని గుర్తిస్తున్నారు.

విభిన్న శక్తుల మధ్య సంఘర్షణ జరుగుతుందని అప్పుడు రకరకాల మానసిక రుగ్మతలు కలుగుతాయని ఈ సందర్భంలో స్వప్న రూపంలో అణచబడిన కోరికలు దర్శనమిస్తాయనడానికి సిటీబ్యూటిఫుల్ నవలలో దేవిదాసు కల ఒక ఉదాహారణ.

అచేతన ప్రాతిపదికలను వెలికి తీయాలనే అంశం కేశవరెడ్డి రచనల్లో దర్శనమిస్తుంది. మానవ మేధను అంచనా వేయడానికి పురాగాధల పరిశీలన అవసరం. మానవ సంస్కృతిని అధ్యయనం చేయడానికి సామాజిక శాస్త్రం, మనో విశ్లేషణ శాస్త్ర విజ్ఞానం అవసరం.